క్లుప్తంగా

కరువు రైతుల జాబితా ప్రదర్శన



రైతు సేవా కేంద్రంలో జాబితా ప్రదర్శించిన దృశ్యం

యాడికి: మండలంలోని అన్ని రైతు సేవా కేంద్రాల్లో సామాజిక తనిఖీ కోసం అర్హులైన కరువు రైతుల జాబితా ప్రదర్శించినట్లు మండల వ్యవసాయ అధికారి మహబూబ్‌బాషా మంగళవారం తెలిపారు. ఏఓ మాట్లాడుతూ ఖరీఫ్‌లో సాధారణ వర్షపాతం కన్నా తక్కువగా వర్షాలు కురవడంతో సాగు చేసిన పంటలు దెబ్బతిన్నాయన్నారు. దెబ్బ తిన్న పంటలను గుర్తించి రైతులు సాగు చేసిన పంటల, ఆధార్, బ్యాంకు అకౌంటు వివరాలను నమోదు చేసుకున్నామన్నారు. అర్హులైన రైతుల తుది జాబితాను ఈ నెల 28న ఉన్నతాధికారులకు నివేదిక పంపుతామని ఏఓ తెలిపారు.

లేబర్ కోడ్‌లు రద్దు చేయాలి



ఏఓకు వినతి పత్రం అందజేస్తున్న సీఐటీయూ నాయకులు

గుంతకల్లు: కార్మికుల హక్కులను కాలరాస్తున్న లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక ఆర్డీఓ కార్యాలయం ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు కసాపురం రమేష్, సాకే నాగరాజు, సీనియర్ నాయకుడు బి.శ్రీనివాసులు మాట్లాడుతూ దాదాపు 44 కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్‌లుగా కేంద్ర ప్రభుత్వం కుదించిందన్నారు. ప్రధాని మోదీ పెట్టుబడిదారులకు కొమ్ముకాస్తున్నారన్నారు. రైతులు పండించిన పంటలకు కనీస మద్దతు ధర చట్టం అమలు చేయాలన్నారు. రైతుల రుణాలను మాఫీ చేయాలన్నారు. విద్యుత్ సవరణ బిల్లు 2022ను రద్దు చేయాలన్నారు. ఉపాధి హామీ పథకం పనిదినాలను 200 రోజులకు పెంచాలని డిమాండ్ చేశారు. అనంతరం ఏఓ ఈశ్వరయ్యకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు నరసయ్య, తిమ్మప్ప, మారుతి, జగ్గలి రమేష్, సురేంద్ర, వైటీసీ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి ఆలయంలో తులసీ దామోదర పూజ



తులసీ పూజ నిర్వహిస్తున్న దృశ్యం

గుంతకల్లుటౌన్: స్థానిక రాజేంద్రనగర్‌లోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం తులసీ దామోదర పూజ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఆలయ వేదపండితులు తులసి, ఉసిరి చెట్టు వద్ద పూజలు నిర్వహించి భక్తాదులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు భాస్కర్ రంగయ్య, ఉపాధ్యక్షులు రమేష్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, కార్యదర్శి నారాయణస్వామి, కోశాధికారి సుధాకర్, వెంకట్, రంగస్వామి, శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

రోగులకు మెరుగైన సేవలందించండి




మాట్లాడుతున్న ఎమ్మెల్యే అస్మిత్‌రెడ్డి

తాడిపత్రిటౌన్: రోగులకు మెరుగైన వైద్య సేవలందించాలని ఎమ్మెల్యే జేసీ అస్మిత్‌రెడ్డి సూచించారు. పట్టణంలోని ఏరియా ఆస్పత్రిలో మంగళవారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆస్పత్రిలో అపరిశుభ్రతపై ఆయన మండిపడ్డారు. అనంతరం వైద్యులు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఆస్పత్రిలో అపరిశుభ్రత కారణంగా రోగులు ఒక రోగంతో వచ్చి ఇంకో రోగంతో వెళ్తున్నారన్నారు. వైద్యులు రోగులకు చికిత్స అందించడమే కాకుండా ఆస్పత్రి శుభ్రతపై కూడా శ్రద్ధ వహించాలన్నారు. అనంతరం ఆస్పత్రిలో సమస్యలపై ఆరా తీశారు. కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ డెవిడ్, సీఎస్ఆర్ఎంఓ క్రిష్ణవేణి, వైద్యులు ఇస్దాని, వసీమ్, నాగార్జున, ఇమానియల్, పవన్, భగీరథ, మంజుల, ఉషా, జాహ్నవి, వార్డు కౌన్సిలర్లు పాల్గొన్నారు.

షెడ్లు నాణ్యతగా నిర్మించాలి

శింగనమల : ఉపాధి హామీ పథకం కింద పశువుల షెడ్లను నాణ్యతగా నిర్మించాలని ఎంపీడీఓ నిర్మలాకుమారి సూచించారు. మంగళవారం మండలంలోని సలకంచెరువు, నాయనవారిపల్లి, రాచేపల్లి గ్రామాల్లో నిర్మిస్తున్న పశువుల షెడ్లను ఆమె పరిశీలించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ మంజూరైన పశువుల షెడ్లను త్వరగతిన పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో టెక్నికల్ , ఫీల్డ్‌అసిస్టెంట్లు పాల్గొన్నారు.

రైల్వే క్వార్టర్స్‌లో భయం.. భయం



- అడవిని తలపిస్తున్న క్వార్టర్స్
- రాత్రి వేళ విష పురుగుల సంచారం
- భయాందోళనలో రైల్వే కార్మికులు

గుత్తి: గుత్తి ఆర్ఎస్‌లోని రైల్వే క్వార్టర్స్ చిట్టడివిని తలపిస్తున్నాయి. క్వార్టర్స్ కూడా కనిపించనంతగా పనికిరాని చెట్లు పెరిగిపోయాయి. అడవి మాదిరిగా తయారైంది. రాత్రి వేళ పాములు, తేళ్లు, జెర్రలు వంటి విష పురుగులు సంచరిస్తుండడంతో రైల్వే కార్మికులు , వారి కుటుంబ సభ్యులు భయాందోళన చెందుతున్నారు. ఒక వేళ రాత్రి సమయాల్లో కరెంట్ పోతే భయంతో బిక్కు బిక్కుమని కాలం గడపాల్సి వస్తోందని మహిళలు వాపోతున్నారు. చిన్న పిల్లలు ఆడుకునేందుకు సైతం బయటకు వెళ్లలేక పోతున్నారన్నారు. విష పురుగుల బెడదతో ఇంటి



రైల్వే క్వార్టర్స్‌లో అపరిశుభ్రత ఇలా..

పరిసరాల్లో వాకింగ్ కూడా చేయలేకపోతున్నామన్నారు. రైల్వే కార్మికులు పలుమార్లు ఈ విషయాన్ని సంబంధిత రైల్వే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. అయినా ఎవరూ స్పందించడం లేదు. దీంతో చిట్టడివిలో బిక్కు బిక్కుమంటూ కాలం వెళ్లదీస్తున్న భావనలో రైల్వే కార్మిక కుటుంబాలు ఉన్నాయి. అలాగే క్వార్టర్స్‌లో చెత్త సమస్య వేధిస్తోంది. అపరిశుభ్రతతో దోమలు విజృంభించి రాత్రిపూట అవస్థలు పడుతున్నామన్నారు.

ఇప్పటికైనా సంబంధిత రైల్వే శాఖ అధికారులు స్పందించి క్వార్టర్స్‌ను శుభ్రం చేయించాలని కార్మికులు కోరుతున్నారు.

ఇళ్ల చుట్టూ కంపచెట్లు, ముళ్ల పొదలున్న దృశ్యం

బయటకు రాలేకపోతున్నాం



క్వార్టర్స్‌లో పనికి రాని చెట్లు, గడ్డి, పిచ్చి మొక్కలు ఏపుగా పెరిగాయి. పాములు, తేళ్లు సంచరిస్తున్నాయి. రాత్రి వేళ భయమేస్తోంది. సంబంధిత అధికారులు స్పందించి పనికి రాని చెట్లను కొట్టి వేసి, పరిసరాలను శుభ్రం చేయించాలి. – సుమలత, రైల్వే కార్మికురాలు, గుత్తి ఆర్ఎస్

కరెంట్ పోతే వణికిపోతున్నాం



రాత్రి వేళ కరెంట్‌పోతే వణికిపోతున్నాం. పాములు, తేళ్లు, మండ్రె గబ్బలు, జెర్రెలు సంచరిస్తుండడంతో ఎపుడు ఏం జరుగుతుందోనని భయపడుతున్నాం. పనికి రాని చెట్లు, గడ్డి, కంపలు, పిచ్చి మొక్కలు తొలగించాలి. అలాగే దోమలు విజృంభిస్తున్నాయి. –సునాయి, రైల్వే కార్మికుడి భార్య

పోస్టాఫీసులో ఎన్‌పీసీఐ కౌంటర్లు

గుత్తి/గుంతకల్లు రూరల్: గుత్తి పట్టణంలోని కోట వీధిలో ఉన్న హెడ్ పోస్టాఫీసులో మంగళవారం ఎన్‌పీసీఐ (నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా) కౌంటర్లు ఏర్పాటు చేశారు. పోస్ట్ మాస్టర్ రాఘవేంద్ర కౌంటర్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర , రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలకు సంబంధించిన లబ్ధి పొందాలంటే తప్పకుండా ఎన్‌పీసీఐ చేయించుకోవాలన్నారు. ప్రజల సౌకర్యార్థం పోస్టాఫీసులో రెండు ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేశామన్నారు. ఆధార్, మొబైల్ నంబర్ తీసుకొచ్చి ఎన్‌పీసీఐ చేయించుకోవచ్చునన్నారు. అలాగే ఇండియా పోస్ట్ పేమెంట్ బ్యాంక్ (ఐపీపీబీ) ఖాతాను ప్రారంభించడం వల్ల ప్రభుత్వం అమలు చేసే సంక్షేమ పథకాల నిధులు నేరుగా లబ్ధిదారుల ఖాతాలోకి జమ అవుతాయని గుంతకల్లు సబ్ డివిజన్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ ఆఫ్ పోస్టాఫీసెస్ విజయభాస్కర్ మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు.



గుత్తిలోని హెడ్ పోస్టాఫీసులో ఏర్పాటు చేసిన ఎన్‌పీసీఐ కౌంటర్

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు



ఆటో డ్రైవర్లకు సూచనలిస్తున్న ఎస్‌ఐ ఆంజనేయులు

పెద్దవడుగూరు: ఆటో డ్రైవర్లు నిబంధనలకు విరుద్ధంగా వాహనాలు నడిపితే కఠినచర్యలు తప్పవని ఎస్‌ఐ ఆంజనేయులు హెచ్చరించారు. మంగళవారం మండలంలోని ఆటో డ్రైవర్లకు కౌన్సెలింగ్ ఇచ్చారు. డ్రైవింగ్ లైసెన్స్, ఇన్సూరెన్స్ తప్పకుండా ఉండాలన్నారు. లైసెన్స్‌లు లేని వాహనాలను సీజ్ చేస్తామన్నారు. ఆటో కెపాసిటీని బట్టి ప్రయాణికులను ఎక్కించుకోవాలని సూచించారు. ప్రతి ఒక్కరూ రోడ్డు నింబధనలు పాటించాలన్నారు.

మాదక ద్రవ్యాలకు బానిసలుగా మారొద్దు

గుంతకల్లుటౌన్: మాదకద్రవ్యాల వినియోగం మనిషి ఆరోగ్యంపైనే కాకుండా సమాజంపైనా తీవ్ర దుష్పరిణామాలు చూపుతుందని వన్‌టౌన్ సీఐ మనోహర్ అన్నారు. మంగళవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మాదకద్రవ్యాల వినియోగంతో కలిగే నష్టాలు, ఆరోగ్య సమస్యలపై అవగాహన సదస్సును నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ మాదకద్రవ్యాలకు బానిసై నేరాల్లో చిక్కుకుని ఉజ్వల భవిష్యత్తును పాడుచేసుకోవద్దని సీఐ సూచించారు. అంతకుముందు రాజ్యాంగ దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సాలబాయి, అధ్యాపకులు సలోమిరాణి, ఎన్ఎస్ఎస్ ఆఫీసర్లు శివప్రసాద్, రాజయ్య, చంద్రమోహన్‌రెడ్డి, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా కార్తీక పూజలు



గుత్తిలోని కాశీ విశ్వేశ్వర శివాలయంలో అభిషేకం చేస్తున్న దృశ్యం



పామిడిలో శ్రీదేవి, భూదేవి సమేత స్వామివారి ప్రాకారోత్సవ దృశ్యం

గుత్తి/పెద్దవడుగూరు/పామిడి: గుత్తి మున్సిపాలిటీ పరిధిలోని అన్ని శివాలయాల్లో కార్తీక మంగళవారాన్ని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కాశీ విశ్వేశ్వర దేవాలయం, నగరేశ్వరాలయం, నాగలింగేశ్వరాలయం, అయ్యప్ప ఆలయాల ఆవరణలో మహిళలు కార్తీక దీపాలు వెలిగించారు. అలాగే పెద్దవడుగూరు లోని చెన్నకేశవస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆకాశ దీపోత్సవం చేపట్టారు. కార్యక్రమంలో భక్తులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు. అదేవిధంగా పామిడి పట్టణంలోని తగ్గుదేవాలయంలోనూ, రంగసుభే ఫిర్కా విఠోబ ఆలయాల్లో మంగళవారం వేర్వేరుగా ఆవిర్భావ ఏకాదశి పూజా కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. అనంతరం ఆయా ఆలయాల్లో దేవతామూర్తులను పల్లకిలో ఉంచి ప్రాకారోత్సవం చేశారు. అలాగే భోగేశ్వరాలయంలో ఉత్పన్న ఏకాదశి పూజా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు.

కేబుల్ చోరీలను అరికడతాం: డీఎస్పీ

యాడికి: వ్యవసాయ బోరుబావుల వద్ద కేబుల్ వైరు చోరీకి గురి కాకుండా రైతులతో పాటు పోలీసులతో కలిసి నాలుగు బృందాలుగా ఏర్పాటు చేసి చోరీలను అరికడతామని తాడిపత్రి డీఎస్పీ రామకృష్ణుడు అన్నారు. మండలంలోని దైవాలమడుగులో ఈ నెల 20న 8 మంది రైతుల తోటల్లో, 22న ముగ్గురు రైతుల తోటల్లో, 25న నలుగురు రైతులకు చెందిన వ్యవసాయ బోరుబావుల వద్ద మోటర్లకు ఉన్న కేబుల్ చోరీకి గురైంది. డీఎస్పీ మంగళవారం సాయంత్రం దైవాలమడుగు గ్రామానికి చేరుకొని చోరీ జరిగిన పొలాలను పరిశీలించారు. నిందితులను పట్టుకొని క్రిమినల్ కేసును నమోదు చేస్తామని డీఎస్పీ తెలిపారు. సీఐ ఈరన్న, పోలీసులు, రైతులు పాల్గొన్నారు.



పొలాలను పరిశీలిస్తున్న డీఎస్పీ రామకృష్ణుడు

భారత రాజ్యాంగం ప్రపంచ దేశాలకు ఆదర్శం



గుంతకల్లులో ప్రతిజ్ఞ చేయిస్తున్న డీఆర్ఎం విజయ్‌కుమార్



గుత్తి ఏడీజే కోర్టులో ప్రతిజ్ఞ చేయిస్తున్న జడ్జి శ్రీహరి



బుక్కరాయసముద్రంలో రాజ్యాంగ దినోత్సవం నిర్వహిస్తున్న అధికారులు , ప్రజాప్రతినిధులు

సాక్షి నెట్‌వర్క్: భారత దేశ రాజ్యాంగం ప్రపంచ దేశాలకు ఆదర్శమని వక్తలు అన్నారు. గుంతకల్లు, తాడిపత్రి, శింగనమల నియోజకవర్గాల్లో మంగళవారం రాజ్యాంగ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు, అనధికారులు, ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులు, కుల సంఘాలు, ప్రజా సంఘాల నేతలు అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా విద్యాలయాల్లో క్విజ్ పోటీలను నిర్వహించి విజేతలకు ప్రశంసాపత్రాలను అందజేశారు. గుంతకల్లులోని డీఆర్ఎం కార్యాలయంలో డీఆర్ఎం విజయకుమార్, గుత్తిలోని ఏడీజే కోర్టులో జడ్జి శ్రీహరిపై రాజ్యాంగ దినోత్సవంపై మాట్లాడారు.



గుత్తి ఎంపీడీఓ కార్యాలయంలో అంబేద్కర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎంపీపీ



గుత్తిలో రాజ్యాంగ దినోత్సవం నిర్వహిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు



పెద్దవడుగూరులో దేశ నాయకుల వేషధారణలో విద్యార్థులు



గుంతకల్లులో అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న చైర్‌పర్సన్ భవాని, వైఎస్సార్ సీపీ నాయకులు

విప్లవాత్మక ఆవిష్కరణలు అవసరం



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న దృశ్యం

బుక్కరాయసముద్రం: ఇంజినీరింగ్ విద్యార్థులకు చదువులతో పాటు సాంకేతిక విప్లవాత్మక ఆవిష్కరణలు ఎంతో అవసరమని ప్రిన్సిపాల్ డాక్టర్ బాలక్రిష్ణ సూచించారు. మంగళవారం మండలంలోని రోటరీపురంలో ఉన్న ఎస్ఆర్ఐటీ ఇంజినీరింగ్ కళాశాలలో ఈసీ విభాగం ప్రతినిధులు ప్రాజెక్ట్ ఇన్నోవేషన్ నిర్వహించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఈవెంట్‌లో ఎంబెడెడ్ సిస్టం ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ అప్లికేషన్‌లతో సహా వివిధ విభాగాల్లో విస్తృతమైన ప్రాజెక్ట్‌లు ఉన్నాయన్నారు. మినీ ప్రాజెక్ట్ ఎక్స్‌పో విద్యార్థులకు ఆచరణాత్మక సెట్టింగ్‌లలో సైద్ధాంతిక పరిజ్ఞానాన్ని వర్తింప చేయడానికి ఒక వేదికను అందిస్తుందన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాస్, టీపీఓ డాక్టర్ రంజిత్ రెడ్డి, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ సాయి చైతన్య కిషోర్ డాక్టర్ రవిచంద్ర, వరుణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర సస్యరక్షణతో అధిక దిగుబడులు

గుంతకల్లు రూరల్/గుత్తి రూరల్: సమగ్ర సస్యరక్షణతోనే అధిక దిగుబడులు సాధ్యమని ఏఓ స్వాతి రైతులకు సూచించారు. మంగళవారం గుంతకల్లు మండలంలోని తిమ్మాపురం, నక్కనదొడ్డి గ్రామాల్లో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె పంటల సాగులో మెలకువలు, తెగుళ్ల సోకినపుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ ఏడాది రబీ సీజన్ నుంచి పంటల బీమా ప్రీమియం రైతులు చెల్లించాల్సిన నేపథ్యంలో.. ప్రతి రైతూ కామన్ సర్వీస్ సెంటర్ పాయింట్ ద్వారా ప్రీమియం చెల్లించాలన్నారు. అలాగే గుత్తి మండలంలోని తొండపాడు గ్రామంలో ఏఓ ముస్తాక్ అహ్మద్ పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఏఓ మాట్లాడుతూ ప్రకృతి వైపరీత్యాలతో సరైన దిగుబడి రాక పంటలకు నష్టం వాటిల్లితే బీమా ద్వారా రైతులు లబ్ధి పొందవచ్చన్నారు. మామిడి, టమాటా, వేరుశనగ, మొక్కజొన్న, పప్పుశనగ, జొన్న, వరి పంటలకు బీమా వర్తిస్తుందన్నారు.

'ఫసల్ యోజన కింద ప్రీమియం చెల్లించాలి'

తాడిపత్రి రూరల్: రైతులు ప్రధానమంత్రి ఫసల్ యోజన కింద ప్రీమియం చెల్లించి బీమా సౌకర్యం పొందాలని మంగళవారం వ్యవసాయ శాఖ ఏడీఏ చంగల్రాయుడు తెలిపారు. మంగళవారం ఆయన మాటాడుతూ ఈఏడాది అక్టోబర్ 1 నుంచి డిసెంబర్ 15 వరకూ సాగు చేసిన పంటలకు ప్రీమియం చెల్లించాలన్నారు. వ్యవసాయ పంటలకు 0.5 శాతం. ఉద్యాన పంటలకు 5.0శాతం చొప్పున ప్రీమియం చెల్లించాలన్నారు. వేరుశనగ ఎకరాకు రూ.480, మొక్కజొన్నకు రూ.525, వరికి రూ.630, జొన్న రూ.315లు, శనగకు రూ.450 చొప్పున ప్రీమియం చెల్లించాల్సి ఉంటుందన్నారు. వాతావరణ అధారిత భీమా కింద టమాట ఎకరాకు రూ.1600, మామిడికి రూ.1650 చెల్లించాలన్నారు.

సమస్యల పరిష్కారంపై దృష్టి

తాడిపత్రి రూరల్: ప్రజా సమస్యల పరిష్కారంపై దృష్టి పెట్టాలని మునిసిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి సూచించారు. స్థానిక మునిసిపల్ కార్యాలయంలో మంగళవారం సాయంత్రం సచివాలయ అడ్మిన్‌లతో ఆయన సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ సచివాలయాల పరిధిలో ప్రజల సమస్యల పరిష్కారం కోసం పాటుపడాలన్నారు. పారిశుధ్యంపై దృష్టి పెట్టాలన్నారు. వార్డుల్లో సమస్యలు గుర్తించి కమిషనర్ దృష్టికి తీసుకురావాలన్నారు. ఇంటి పన్నులు, కొళాయి పన్నులు, మునిసిపాలిటీకి రావలసిన బాడుగలు, బకాయిలు వసూలు చేయడంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆదేశించారు.

'ఎస్సీ, ఎస్టీలకు రుణాలివ్వండి'

తాడిపత్రి అర్బన్: ఎటువంటి ష్యూరిటీ లేకుండా అర్హులైన ఎస్సీ, ఎస్టీలకు సబ్సిడీ రుణాలను ఇవ్వాలని బ్యాంక్ ఆఫ్ బరోడా లీడ్ బ్యాంకు మేనేజర్ ఎల్‌డీఎం నరసింగరావుకు ఎమ్మార్పీఎస్ నాయకులు వినతిపత్రం అందజేశారు. మంగళవారం తాడిపత్రి బ్రాంచ్ తనిఖీకి వచ్చిన ఎల్‌డీఎంను ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రామాంజనేయులు, శింగమనమల నియోజకవర్గ ఇన్‌చార్జి రంగనాథ్, నాయకులు నాగభూషణం కలిశారు. ఎమ్మార్పీఎస్ నాయకుడు టి.శ్రీనివాసులు, ఏఐఎఫ్ నాయకుడు రాజా, పట్టణాధ్యక్షుడు సంతోష్, మల్లి, ఎంఎస్ఎస్ నాయకుడు మంజునాథ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు నేరం



అవగాహన కల్పిస్తున్న హెల్త్ ఎడ్యుకేటర్ వేణుగోపాల్

గుంతకల్లుటౌన్: బాల్యవివాహాలు చట్టరీత్యా నేరమని అర్బన్ హెల్త్‌సెంటర్ వైద్యురాలు స్వాతి, హెల్త్ ఎడ్యుకేటర్ వేణుగోపాల్ సూచించారు. మంగళవారం డాక్టర్ సరోజినీనాయుడు మున్సిపల్ గరల్స్ హైస్కూల్‌లో విద్యార్థినులకు గర్భస్థ లింగ నిర్ధారణ నిరోధక చట్టం, బాల్య వివాహాల నిషేధ చట్టాలపై అవగాహన కల్పించారు. బాలికలు బాగా చదువుకుని పురుషులకు దీటుగా అన్ని రంగాల్లో రాణించాలన్నారు. లింగనిర్ధారణ పరీక్షలు చేసిన వారికి, చేయించిన వారికి, ప్రోత్సహించిన వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ సహెరాబానూ, ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

కంటి వైద్య శిబిరానికి స్పందన



వైద్య పరీక్షలు చేస్తున్న దృశ్యం

పామిడి: పట్టణంలోని వాసవీ కల్యాణ మండపంలో మంగళవారం పామిడి లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో బెంగుళూరు శంకర కంటి ఆసుపత్రి సౌజన్యంతో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి అనూహ్య స్పందన లభించింది. ఈ సందర్భంగా కంటి వైద్య నిపుణుడు సోహెల్ 150 మందికి ఉచిత కంటి పరీక్షలు చేశారు. 62 మందిని కంటి శస్త్ర చికిత్సలకు ఎంపిక చేశారు. అనంతరం రోగులకు అన్నదానం నిర్వహించారు. శస్త్ర చికిత్సలకు ఎంపికైనవారిని బస్సులో ఉచితంగా బెంగుళూరుకు తరలించారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ వ్యవస్థాప అధ్యక్షుడు, ప్రభుత్వ ఆయూష్ సీనియర్ వైద్యాధికారి నల్లపాటి తిరుపతి నాయుడు, క్లబ్ ప్రెసిడెంట్ రఘువీర్, ఉపాధ్యక్షుడు పత్రా శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శి పీసీ జయరామ్‌రావు, నిర్వహణ కార్యదర్శి రోషన్ జమీర్, కోశాధికారి షెక్షావలి, మెంబర్‌షిప్ ఛైర్‌పర్సన్ డాక్టర్ శాంతి ప్రియ, జిల్లా చైర్మన్ డాక్టర్ మురళీకృష్ణ, డైరెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

యువకుడి మృతి



సూర్యనారాయణరెడ్డి

తాడిపత్రి రూరల్: మండలంలోని వెంకటరెడ్డిపల్లి వద్ద ఈ నెల 16న జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన సూర్యనారాయణరెడ్డి(22) మంగళవారం మృతి చెందాడని అప్‌గ్రేడ్ సీఐ శివగంగాధర్‌రెడ్డి తెలిపారు. బెంగుళూరులో చికిత్స పొందుతూ మృతి చెందాడన్నారు.

'బయోమెట్రిక్ తప్పనిసరి'

గార్లదిన్నె: సచివాలయ సిబ్బంది రోజూ బయోమెట్రిక్ తప్పనిసరిగా నమోదు చేసు కోవాలని ఎంపీడీఓ యోగానందరెడ్డి సూచించారు. మంగళవారం మండలంలోని బూదేడు గ్రామ సచివాలయాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సిబ్బంది హాజరు శాతం పరిశీలించారు. సచివాలయ సిబ్బంది కార్యాలయంలో అందుబాటులో ఉండి ప్రజల సమస్యలు పరిష్కారించాలన్నారు. అనంతరం సచివాలయ పరిధిలోని గోకులం షెడ్ నిర్మాణ పనులు, ఇంకుడు గుంత పనులు పరిశీలించారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ



ప్రతిభ కనబరిచిన విద్యార్థులు

బుక్కరాయసముద్రం: స్కూల్ గేమ్ ఫెడరేషన్ సాఫ్ట్ బాల్ రాష్ట్రస్థాయి పోటీల్లో బుక్కరాయసముద్రం విద్యార్థులు ప్రతిభ కనబరిచారని ప్రధానోపాధ్యాయురాలు వసుంధర, పీడీ గోపాల్‌రెడ్డి పేర్కొన్నారు. పాఠశాలలో చరణ్‌తేజ జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. వచ్చే ఏడాది జనవరి 5 నుంచి 9వ తేదీ వరకు మహారాష్ట్రలోని జల్గావ్‌లో నిర్వహించే జాతీయ స్థాయి పోటీల్లో రాష్ట్రం తరపున పాల్గొంటారన్నారు. అలాగే మునీంద్ర, శశి, ప్రవీణ్‌కుమార్, అజయ్ ప్రతిభ కనబరిచారన్నారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను హెచ్ఎం, పీడీతోపాటు లలితమ్మ తదితర ఉపాధ్యాయ బృందం అభినందించారు.